క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఇంటర్మీడియెట్ కళాశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డిస్ట్రిక్ పూర్వ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరావు మాట్లాడుతూ మొదటి సంవత్సరం పూర్తి చేసిన ఎంపీసీ, బైపీసీల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరి రెండు వేల రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి వెయ్యి రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు తెలిపారు. వడ్డేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సుబ్బారావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

తాడికొండ: ఈ నెల 13న మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల మండల స్థాయి అధికారులు తమ తమ అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

వీఆర్ఏల సంఘం మాజీ అధ్యక్షుడి మృతి

తాడికొండ: తుళ్లూరు మండల వీఆర్ఏల సంఘం మాజీ అధ్యక్షుడు తురకా అమృతరావు(80) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతికి పలువురు వీఆర్ఏలు, సీఐటీయూ నాయకులు సంతాపం తెలిపారు.

చుండూరు దళిత మృత వీరులకు ఘన నివాళులు



మంగళగిరి: చుండూరు దళితులపై మారణకాండ జరిగి నేటికి 33 సంవత్సరాలు గడిచినా.. మృతికి కారణమైన వారికి నేటికి శిక్ష పడకపోవడం సమాజంలో అగ్రవర్ణాల ఆధిపత్యం ఎలా కొనసాగుతుందో అర్థం అవుతుందని ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు పేర్కొన్నారు. పట్టణంలోని పార్కు రోడ్డులో కల ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యలయంలో మంగళవారం చుండూరు మృత వీరుల జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు చార్వాక, మేడం భాగ్యరావు, విద్యాసాగర్, రమాదేవి పాల్గొన్నారు.

జీజీహెచ్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలిసి లిఖిత పూర్వకంగా మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్ అర్హతగా పేర్కొన్నారని, తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో డిగ్రీ అర్హతగా ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం ఇంటర్ అర్హత సరిపోతుందని, ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ రద్దు చేసి నూతన నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోటా మాల్యాద్రి, నగర కార్యదర్శి విజయ్‌బాబు, జీజీహెచ్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.నాగరాజు, పి.ఏడుకొండలు, బ్రాంచి సహాయ కార్యదర్శి అబ్రహం పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

లక్ష్మీపురం: ఉపాధి హామీ కూలీలకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.95 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పనిచేసే క్షేత్ర స్థాయి సిబ్బందిపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. 100 రోజులుపని పూర్తి అయిన ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రంకొండ సత్యానందం, రెంటాల కుమారి, మేరిగ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

- డ్రైయిన్‌లో చెత్త వేసే హోటళ్లు, రెస్టారెంట్‌లపై కఠిన చర్యలు
- ఎప్పటికప్పుడు పూడిక తీయిస్తున్న ఎంటీఎంసీ అధికారులు
- గోశాలకు ఆవుల తరలింపు



పొక్లెయిన్‌తో రత్నాల చెరువులోని డ్రైయిన్‌లో పూడితీత పనులు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రత్నాల చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు పారిశుద్ధ్య పనులు వేగవంతం చేశారు. ఇప్పటికే నగరంలో చెత్త తొలగింపులో అలసత్వం ప్రదర్శించకుండా..అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నగరంలోఎక్కడా చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని మురుగు కాల్వల్లో చెత్త లేకుండా పూడిక తీయడంతో పాటు.. తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. దోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రజారోగ్యంతో ప్రమాదాలు అడ్డంకిగా మారిన ఆవులను యజమానులు రక్షించుకోవాలని ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో నగరం నుంచి ఆవులను గోశాలకు తరలించి కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే గోవులను సంరక్షిస్తున్నారు. గోశాల నుంచి ఆవులను యజమానులు తీసుకెళ్లక పోతే..



ఆవులను గోశాలకు తరలిస్తున్న సిబ్బంది

ఆవులను కొద్ది కాలం అనంతరం శాశ్వతంగా అడవులకు తరలిస్తామని కార్పొరేషన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. యజమానులు ఆవులను తీసుకెళితే.. సంరక్షణ కోసం.. ఖర్చులు చెల్లించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ, ప్రమాదాల నివారణకు ఆవుల యజమానులు సహకరించపోవడం బాధాకరమని అధికారులు అంటున్నారు. ఆవుల యజమానులు సహకరించకపోవడంతో మంగళవారం ఆవులను తామే గోశాలకు తరలిస్తు తరలించామని చెప్పారు. నగర ప్రజల ఆరోగ్య సంరక్షణతో పాటు.. వాహనదారులు ప్రమాదాలకు గురయ్యి.. ప్రాణాలు కోల్పోకుండా.. క్షతగాత్రులు కాకుండా సహకరించాలని గోవుల యజమానులను కోరారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల సవరణ బిల్లును వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును అన్ని సెక్యులర్ పార్టీలు వ్యతిరేకించాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని కోరారు. మంగళవారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సవరణ వల్ల వక్ఫ్ బోర్డు తన అస్తిత్వాన్ని కోల్పోవడమే కాకుండా ఆస్తులను భారీగా కోల్పోయే ప్రమాదముందన్నారు. వక్ఫ్ సంస్థలకు ఎంతో నష్టం జరిగే అవకాశముందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ముస్లింల ఆస్తులను కాపాడేందుకు 1954 వక్ఫ్ చట్టం తీసుకొచ్చారని, ప్రస్తుత వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని వివరించారు. వాటిని కాపాడేందుకు ఎండోమెంట్ తరహాలో అధికారాలు ఇవ్వాల్సింది పోయి.. వక్ఫ్ బోర్డు అధికారాలను కుదించే విధంగా బిల్లు ప్రవేశపెట్టడం వక్ఫ్ ఆస్తులను కాజేయాలనే దురుద్దేశంతోనే.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తీసుకువచ్చారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జానీ సైదా తదితరులు పాల్గొన్నారు.

పంటల యాజమాన్యంతో రైతులకు మేలు

జిల్లా వనరుల కేంద్రం కో–ఆర్డినేటర్ సునీత, లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్ చౌదరి



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఆర్‌సీ కో–ఆర్డినేటర్, లాంఫాం శాస్త్రవేత్త

పెదపరిమి(తాడికొండ): వాతావరణ ఆధారిత పంటల యాజమాన్యంతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం కో–ఆర్డినేటర్ ఐ.సునీత, లాం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.రాజేష్ చౌదరి పేర్కొన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో రైతులకు వాతావరణాధారిత పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పత్తి పంటను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. పంటలలో జీవన ఎరువులైన ట్రైకో డెర్మావిరిడికి పశువుల ఎరువులో కలిపి వృద్ధి చేసుకోవాలన్నారు. ఇందు కోసం 90 కేజీల పశువుల ఎరువు, 10 కేజీల వేప పిండి, 2 కేజీల ట్రైకో డెర్మావిరిడి కలిపి దీనికి.. కేజీ బెల్లాన్ని కలిపి పశువుల ఎరువుపై చల్లాలన్నారు. విచక్షణా రహితంగా పురుగు మందులను వాడవద్దని, పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులందరూ సామూహికంగా ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని వివరించారు. పత్తి పంట పూత, పిందె దశలో ఎకరాకి 5 శాతం వేప గింజల కషాయం లేదా వేపనూనె 5 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీ రంజని, పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నేత శివశంకరరావు



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

తాడికొండ: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన విపత్తు కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితుల సహాయార్థం మంగళవారం తుళ్లూరులో సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో వ్యాపార సంస్థలు, సామాన్య ప్రజల వద్ద జోలె పట్టి సాయం అర్థించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం. భాగ్యరాజు మాట్లాడుతూ వయనాడ్‌లో జరిగిన విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు పేరం బాబురావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోండి

తాడేపల్లిరూరల్ : సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ గ్రామంలో వయనాడ్ బాధితుల కోసం సహాయ నిధి వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు రూ.65,575లు నిధిని సేకరించినట్లు తెలిపారు. సీపీఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకుడు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, కాట్రగడ్డ శివన్నారాయణ, మండల నాయకులు నాగపోగు విజయరాజు, శ్రీనివాసరావు, రంగారావు, సుధాకర్ పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల గ్రామంలో విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు వయనాడ్ బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.యోగేశ్వరరావు, వై. బ్రహ్మేశ్వరరావు, సీహెచ్ పోతురాజు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

సహజ కాన్పులు పెంచేందుకు కృషి చేయాలి



శిక్షణ పొందిన వారితో డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: సహజ కాన్పుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డులోని సమావేశ మందిరంలో సహజ కాన్పుల్లో శిక్షణ పొందిన మిడ్ వైఫరీ, ఎడ్యుకేటర్స్ మిడ్ వైఫరీ డైరెక్టర్ సారాతో కలసి మంగళవారం ఆయన సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సిజేరియన్ డెలివరీల సంఖ్య పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పురిటినొప్పులు భరించలేక కొంతమంది ఇబ్బందులు పడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని సహజ కాన్పులు అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సాధారణ కాన్పులు చేసే విధంగా శిక్షణ పొందినవారు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిడ్ విఫరీ ప్రతినిధి భీమారాయ్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, మిడ్ వైఫరీ ఎడ్యుకేటర్స్ పి.బేబీ, పి.అపర్ణ, జి.ప్రశాంతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బ్యాంకు మేనేజర్లకు పొదుపు మహిళల వినతి



బ్యాంకు మేనేజర్‌కు సమస్యలు వివరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

తాడేపల్లిరూరల్ : డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్లకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణాల మంజూరులో ప్రాసెసింగ్ చార్జీలు వసూలు చేయరాదని, గ్రూపు మహిళల పొదుపు సొమ్మును అవసరాలకు తీసుకోవడానికి ఆటంకాలు కల్పించరాదని, బలవంతంగా ఇన్సూరెన్స్ కట్టించరాదని వారికి విజ్ఞప్తి చేశారు. పొదుపు డబ్బులను డిపాజిట్ చేయడం వల్ల అవసరాలకు వాడుకోవడం తగ్గిపోతుందని, దాని వల్ల మహిళలు ప్రైవేటు ఫైనాన్స్ ఉచ్చులో పడుతున్నారని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. సుధ, కల్యాణి, జ్యోతి, ఉష పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విద్యార్థి ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీ అగ్రహారం 3వలైనుకు చెందిన పవన్ బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో తొలుత చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. యాప్ నిర్వాహకులు సకాలంలో అతడికి లాభాలు రుచి చూపించారు. దీంతో పవన్ వరసగా ఎక్కువ మొత్తం పెట్టుబడి పెడుతూ వచ్చాడు. చివరకు యాప్ నిర్వాహకులు అసలు, లాభం రెండూ చెల్లించలేదు. మొత్తం రూ.2.35 లక్షలు మోసపోయినట్లు పవన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ మారిస్‌పేటకు చెందిన అబ్దుల్ రజాక్‌కు షేక్ షరీఫ్‌తో ఆస్తి వివాదం నడుస్తోంది. కబేళా వంతెన వద్ద మంగళవారం అబ్దుల్ రజాక్‌పై షరీఫ్ దాడి చేశాడు. బాధితుడిని స్థానికులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. తనపై స్క్రూ డ్రైవర్‌తో దాడి చేశాడని బాధితుడు ఆరోపిస్తున్నాడు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

17న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈ నెల 17న నిర్వహించనున్నట్లు డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణే పరిష్కరించాలని ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక నగరంపాలెంలోని పోస్టల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆల్ ఇండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ 15 డిమాండ్లకు వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని శాఖల అసోసియేషన్లు సమష్టి కృషితో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యతే అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. విశ్రాంత ఉద్యోగులపై ప్రభుత్వం చిన్న చూపు చూడటం మంచిది కాదన్నారు. ధర్నా లో పోస్టల్ గుంటూరు డివిజన్ కార్యదర్శులు వి.మోహన్‌రావు, బి.రామారావు, తెనాలి కార్యదర్శి ఎల్.ప్రసాదరావు, రాష్ట్ర కోశాధికారి సి.హెచ్.హనుమంతరావుపాల్గొన్నారు.

శివాలయంలో శ్రావణ మంగళవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



కంకుమార్చనలో పాల్గొన్న మహిళలు..

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లో శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా శ్రీ శక్తీదేవి, మంగళ గౌరి సంహిత జ్ఞాన సరస్వతీ కనకమహాలక్ష్మి దేవి అమ్మవార్లకు ధార్మిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయ ప్రధాన అర్చకులు తన స్వంత నిధులతో పూజలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. 28వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తెలకదేవరపల్లి మహేష్ శర్మ నిర్వహించిన లక్ష కుంకుమార్చనలో భారీగా మహిళలు హాజరై పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు లక్ష్మీ కుభేర ప్రతిమ డాలర్, రూపు రక్షా తాళ్లను ఉచితంగా అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఖాళీ స్థలం.. రోగాలకు నిలయం



కొత్త పేటలోని పిచ్చిగడ్డి మొలిచిన స్థలం..



ఫిరంగిపురంలో చెత్తతో నిండుకున్న స్థలం

ఫిరంగిపురం: ఖాళీ స్థలాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని కొత్తపేట, తూర్పు బజారు, రసూల్ పేట, అల్లంవారి పాలెం, శాంతిపేట, లక్ష్మీపురం, ప్రకాశం పంతులు నగర్, విజయదుర్గా కాలనీ, ఎస్టీ కాలనీ వంటి ప్రాంతాల్లో ఖాళీ స్థలాలున్నాయి. ఎన్నో ఏళ్ల కిందట కొనుగోలు చేసిన స్థలాల యజమానులు వాటిని పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిగడ్డి, మురుగు నిలిచి పోవడంతో ఆ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అసలే వర్షా కాలం కావడంతో దోమల వృద్ధితో మలేరియా, డెంగ్యూ, జ్వరాలు వచ్చే అవకాశం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో చుట్టు పక్కల నివసించేవారు చెత్త చెదారాన్ని తీసుకొచ్చి వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. మరికొన్ని ప్రదేశాల్లోని ఖాళీ ప్రదేశాలు మందు బాబులకు అనుకూలంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా.. ఆ శాఖ అధికారులు స్పందించి ఖాళీ ప్రదేశాల్లోని పిచ్చి మొక్కలు తీయించేలా సంబంధిత స్థలాల యజమానులకు తెలియజేయాలని, చెత్తా చెదారం వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు అండగా నిలిచిన సీపీఎం నాయకులు



పొక్లెయిన్లు ఆపి ఆందోళన చేస్తున్న కార్మికులు, మద్దతుగా నిలిచిన సీపీఎం, సీఐటీయూ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ భూములు చదును చేయడానికి పొక్లెయిన్లు రావడంతో కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు తదితర నాయకులు కార్మికులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఆర్డర్ ఉన్నా కార్మికులకు నష్ట పరిహారం చెల్లించకుండా భూములను చదును చేయడానికి వీల్లేదన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కోర్టు ఆర్డర్లను లెక్క చేయకుండా ఏసీసీ భూముల్లో పొక్లెయిన్లను పంపి కార్మిక కుటుంబాల జీవితాలతో ఎస్ఆర్ఐ యజమానులు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. బకాయిలు చెల్లించే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఏసీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్ఐ ప్రతినిధి ఘటనా స్థలానికి చేరుకుని కార్మికుల న్యాయమైన కోర్కెలు విని పొక్లెయిన్లు వెనక్కు తీసుకుంటామని, చదును చేయడం ఆపివేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.స్టీవెన్, వై. యెహోషువా, వై. సుబ్బారావు, నవనీతం, గౌరమ్మ, హిమాంభ, రమాదేవి, బి. అంకయ్య, బి. సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన యువకుడి అరెస్ట్

కర్లపాలెం: మండలంలోని నల్లమోతువారిపాలేనికి చెందిన వివాహిత యువతి సూరగాని దుర్గా భవాని(33) ఈ నెల 2న పురుగు మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. ఏట్రవారిపాలేనికి చెందిన గోపిరెడ్డి అనే వ్యక్తి తన భార్యను కొట్టడం వల్లే ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని దుర్గా భవాని భర్త శ్రీనివాసరావు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం గోపిరెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొలనుకొండ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొలనుకొండకు చెందిన షేక్ మస్తాన్(35) స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు : ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఘటన కొల్లూరులో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొల్లూరు డెప్యూటీ తహసీల్దారు నిరంజన్ సిబ్బందితో కలసి నిలువరించారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, తహసీల్దారు బి. వెంకటేశ్వర్లుకు కేసు బదిలీ చేసినట్లు ఏఎస్ఐ అర్జున్ తెలిపారు.

నోటీసు

[illegible]

గాదంశెట్టి రామకృష్ణ, న్యాయవాది.
మంగళగిరి, సెల్ నెం: 9848504078